గ్రూప్‌లు పక్కన పెట్టి పని చేయండి

మీ కోసం కష్టపడతా

- తాండూరులో ఎంపీపీ, జెడ్పీటీసీలను గెలిపించి చరిత్ర తిరగరాస్తా
- పథకాలను ప్రజాల్లోకి తీసుకెళ్లాలి
- కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలు పక్కనపెట్టి పార్టీ కోసం పని చెయ్యాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఆధ్వర్యంలో రాంపూర్ గేటు సమీపంలోని పీఏసీఎస్ గోదాంలో తాండూరు మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా, మండల పరిషత్‌లు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 38 ఏళ్లుగా తాండూరు మండలంలో కాంగ్రెస్ జెడ్పీటీసీ, ఎంపీపీ గెలవలేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాండూరు మండల ఎంపీపీ, జెడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొని చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తం చేశారు. మండలాల్లో నాయకులు, గ్రామాల్లో కార్యకర్తలు సమన్వయంతో పని చేసి అభ్యర్థిని గెలిపించాలని ఆదేశించారు. పార్టీ సూచించిన అభ్యర్థి గెలుపు కోసం అందరూ కలిసి పని చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకోసం కార్యకర్తలు పని చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మీ ఎన్నికలు మీకోసం ఊరూరా తిరుగుతానని కార్యకర్తలను ప్రోత్సహించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసెకెళ్లాలి

తాండూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.700 కోట్ల నిధులు వచ్చాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తాము వెనుకబడి ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన, ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిందని ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. తనను గెలిపించిన తాండూరు ప్రజల రుణం తీర్చుకునేందుకు మాత్రమే తను పని చేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు ధారాసింగ్, ఉత్తమ్‌చందు, రవిగౌడ్, నాగప్ప, రాందాస్, వడ్డె శ్రీను, రాజ్‌కుమార్, శరణబసప్ప, గోపాల్, పండరి, ప్రశాంత్‌రెడ్డి, రాము, అనిల్, సుధాకర్, హర్షవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు సాగు చేయండి

రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని రైతులకు సబ్సిడీ స్పింకర్ల యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సబ్సిడీకి ఎగనామం పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. తాండూరు నియోజవకర్గంలో 137 మంది రైతులకు 137 స్పింకర్లు యూనిట్‌గా పంపిణీ చేశామన్నారు. అనంతరం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి సత్తార్ మాట్లాడారు. రైతులకు 75 శాతం సబ్సిడీతో రుంగ్టా ఇరిగేషన్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో 25 పంపులు, 5 నాజిల్స్ అందజేశామన్నారు.


తాండూరు: కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

స్వయం ఉపాధితోనే ఆర్థిక భరోసా

తాండూరు: మహిళలకు స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా కల్పించేందుకే ప్రభుత్వం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 70మంది మహిళలకు కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. శిక్షణఅనంతరం మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్నామన్నారు. కుట్టు మిషన్ల షాప్‌లను ఏర్పాటు చేసుకొని సొంత గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని సూచించారు. కుట్టు మిషన్లు తీసుకున్న మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు బట్టల కంపెనీలు, ఫ్యాబ్రిక్ ఏజెన్సీలతో మాట్లాడి తగిన అవకాశాలు మెరుగు పడేలా కృషి చేస్తామన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు ధారాసింగ్, మాజీ వైస్ ఎంపీపీ మధులత, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కందనెల్లి శోభారాణి, మహిపాల్‌రెడ్డి, లొంకనర్సింహులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

తాండూరు టౌన్: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివారులోని జీవీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి, తాండూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, పలువురు జర్నలిస్టులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం తరుపున ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేయిస్తానన్నారు. ఇరిగేషన్ శాఖాధికారులతో మాట్లాడి ఖాళీగా ఉన్న భవనాన్ని ప్రెస్‌భవన్ ఏర్పాటు కోసం అందజేస్తానన్నారు. అలాగే జర్నలిస్టులందరికీ ఏడాదికి ఒకసారి చెల్లించే ప్రమాదబీమా ప్రీమియాన్ని తానే చెల్లించి ఆర్థిక చేయూతనిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మాకేదీ ‘భరోసా’?

- ఎస్ఎంఎస్‌లు రావడంతో బ్యాంకులకు వెళ్తున్న లబ్ధిదారులు
- ఖాతాల్లో డిపాజిట్ కాలేదని చెబుతున్న అధికారులు

బొంరాస్‌పేట: ఎకరానికి రూ.12వేల చొప్పున అందిస్తున్న రైతు భరోసా పథకం డబ్బులు అందుతున్నట్లు సెల్‌ఫోన్లల్లో సమాచారం వస్తున్నాయి. దీంతో తమతమ ఖాతాల్లో మాత్రం డబ్బులు జమకాలేదని సదరు బ్యాంకు మేనేజర్లు చెబుతున్నారు. కానీ రెండెకరాల లోపు భూమి ఉన్న రైతులకు కొందరికి జమఅయ్యాయని, మంరికొందరికి జమకాలేదని చెబుతున్నారు. తాజాగా ఎకరంలోపు భూమి ఉన్న వారికి రైతు భరోసా జమఅవుతున్నట్లు రైతులకు సెల్‌ఫోన్‌లలో ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయి. సదరు బ్యాంకుల్లో రైతులు డ్రా చేసుకునేందుకు వెళ్లగా డబ్బులు జమకాలేదని చెప్పడం బాధాకరంగా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన రైతు బాలకిష్టయ్య విలేకరుల ముందు తన ఆవేదనను చెప్పుకున్నాడు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా అందరికీ జమాయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



రైతు భరోసా మంజూరైనట్లు సెల్‌ఫోన్లో వచ్చిన మెసేజ్

క్లుప్తంగా

కొనసాగుతున్న మరమ్మతు పనులు


కొనసాగుతున్న పనులు

దుద్యాల్: మండలంలోని 41 గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మిషన్ భగీరథ ఏఈ సాయినాథ్ రెడ్డి తెలిపారు. కొడంగల్–నాజుఖాన్‌పల్లి గ్రామాల మధ్యలో నేషనల్ హైవే పనులు కొనసాగుతున్న క్రమంలో మండలానికి సరఫరా అయ్యే మిషన భగీరథ ప్రధాన పైపులైన్ (డీఐ) పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. బుధవారం మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో గురువారం కూడా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఏఈ సాయినాథ్ రెడ్డి సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పరిగి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో బుధవారం ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజా ప్రభుత్వమన్నారు. సబ్‌ప్లాన్ ద్వారా ఎస్సీ కాలనీలోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్, రాకేష్, విశ్వచారి, రామచంద్రయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు వివరాల నమోదు షురూ


ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేస్తున్న ఆర్‌ఐ చరణ్ తదితరులు

యాలాల: ప్రజా పాలన దరఖాస్తుల్లో భాగంగా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను రెవెన్యూ సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆర్‌ఐ చరణ్ ఆధ్వర్యంలో విచారణ అనంతరం బుధవారం సాయంత్రం నుంచి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి వేగంగా నమోదు చేస్తున్నారు.

ఘనంగా తిరుమలేశ్వరస్వామి ఉత్సవాలు

దౌల్తాబాద్: మండలంలోని గోకఫస్‌వాద్ గ్రామంలోని గుట్టపై వెలసిన తిరుమలేశ్వర స్వామి వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం స్వామివారికి వేద మంత్రాలతో అభిషేకం, హోమం, కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన బసవేశ్వరట్రేడర్స్ యజమాని ఆవిటి సిద్దేశ్వర్ దంపతులు అన్నదానం నిర్వహించారు. రాత్రి 12గంటలకు రథోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఖేశవరెడ్డి, భీంరెడ్డి, సతీష్, రామకృష్టారెడ్డి, అనంతయ్య, నర్సింహారెడ్డి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

షాద్‌నగర్: విద్యార్థులు లక్ష్యం, పట్టుదలతో చదివితే ఉన్నత భవిష్యత్ పొందుతారని రిటైర్డ్ ఆడిషనల్ కమిషనర్ అనురాధ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనురాధ ముఖ్య అతిథిగా హాజరై కళాశాలలో ఇన్ హౌజ్ జర్నల్ సంచికను ఆవిష్కరించారు. విద్యార్థులు వ్యాసాలు చదివి వినిపించగా వారిని అభినందించారు. మైక్రో బయోలజీ ల్యాబ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి వారి నైపుణ్యాన్ని వెలికితీసి, ఆయా రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే అధ్యాపకుల బాధ్యత అని గుర్తుచేశారు. ఓఎస్‌డీ సీరజ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలే, వైస్ ప్రిన్సిపాల్ సృజన పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి


బాధితుడి తల్లికి ఎల్‌ఓసీ అందజేస్తున్న నాయకులు

పూడూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని డీసీసీ ఉపాధ్యక్షుడు పట్లోళ్ల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన సీహెచ్ క్రిష్ణ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రూ.2లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్‌ను మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీని బాధితుడి తల్లి లక్ష్మమ్మకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, నాయకులు కదీర్, ఇలియాస్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి


రుద్రహోమం నిర్వహిస్తున్న భీంరెడ్డి తదితరులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా ఆయన హోమం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతన కోసం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఆలయ ఈఓ బాలనర్సయ్య, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవిభూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం


శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం

రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని దస్తగిరిపేట్‌లో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణానికి తాండూరు పట్టణంతో పాటు అంతారం, దస్తగిరిపేట్ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆ తర్వాత స్వామివారి రథోత్సవం సాయంత్రం అశ్వావాహన సేవ చేపట్టారు. దీనికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గురువారంతో దేవాలయ వార్షికోత్సవం ముగుస్తోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు వెంకటాచార్ శుక్రవార్, రాఘవేంద్ర శుక్రవార్, పురంధరచార్ శుక్రవార్ పాల్గొన్నారు.

మోడల్‌హౌస్ నిర్మాణానికి భూమిపూజ


మోడల్‌హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి డీఈఈ చందర్‌నాయక్ బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందా? లేదా? అనే సందేహం నివృత్తి చేయడానికి మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, వీరన్న, ఏబీ హన్మంతు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు బంట్వారం, కోట్‌పల్లి ఎంపీడీఓలు రాములు, డానియల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల వారీగా పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా తయారు చేశారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన స్టేషన్ల ముసాయిదా జాబితాపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి తప్పనిసరిగా ఆయా రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని కోరారు. ఉదయం 11:30 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు బండల ఎల్లమ్మ రథోత్సవం

కొడంగల్: పట్టణ శివారులో వెలసిన బండల ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని రాంరెడ్డి నివాసం నుంచి ఆలయం వరకు అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గురువారం ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం బోనాలు, సాయంత్రం రథోత్సవం, శనివారం సాయంత్రం ఎద్దులతో ఊరేగించి ఆదివారం సాయంత్రం పెరుగు బసంతం నిర్వహిస్తారు.

ఆలయ ప్రారంభోత్సవాలను విజయవంతం చేయాలి

కుల్కచర్ల: సేవాలాల్ ఆలయ ప్రారంభోత్సవాలను విజయవంతం చేయాలని కుల్కచర్ల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామంలో నేటి నుంచి మూడు రోజులపాటు ఆలయ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి కుల్కచర్ల మండల పరిధిలోని ప్రజలందరూ పెద్దఎత్తున హాజరై ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

వైభవంగా మాణిక్య ప్రభు జాతర

పరిగి: మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామంలో మాణిక్యప్రభు 78వ వార్షికోత్సవ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండ స్వామి వారిని తీసుకెళ్తూ, కోలాట నృత్యాలు, భజనలతో ఊరేగించారు. అనంతరం పలవురు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని, ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

శివాలయంలో పట్నం నరేందర్ రెడ్డి పూజలు


స్వామి వారిని దర్శించుకున్న నరేందర్ రెడ్డి

దుద్యాల్: మండలంలోని అల్లిఖాన్‌పల్లి గ్రామ శివారులో వెలసిన మర్రికుంట శివాలయంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ప్రతీ సంవత్సరం మాగ మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎమెల్యే ఈ పూజలకు హాజరయ్యారు. ఈ శివాలయం వెనుక భాగాన మర్రి చెట్టులో వినాయకుడి ఆకారం ఉద్భవించిందని గ్రామస్తులు, భక్తులు చెబుతున్నారు. దీన్ని గమనించిన వారు 30 ఏళ్ల నుంచి పూజలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాలానుగుణంగా ఇక్కడ ఆలయం ఏర్పాటయ్యింది. నరేందర్‌రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు విష్ణవర్ధన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నరేశ్, బసప్ప, బసిరెడ్డి తదితరులు ఉన్నారు.

శోభాయమానంగా పాంబండ గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమారెడ్డి

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానం చుట్టూ బుధవారం గిరిప్రదక్షిణను శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాంబండ క్షేత్రం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రతీ పౌర్ణమికి పాంబండ క్షేత్ర గిరిప్రదక్షిణను అనవాయితీగా నిర్వహిస్తున్నారు. బుధవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణలో పరిగి ఎమ్మెల్యే సతీమణి ఉమారామ్మోహన్ రెడ్డి పాల్గొని భక్తులతో నడిచారు. ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యమ్మ, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, ఆనందం, శ్రీశైలం, గోపాల్ రెడ్డి, శివస్వాములు పాల్గొన్నారు.

శివస్వాముల మహా పడిపూజ


దౌల్తాబాద్: పూజలో శివస్వాములు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో వీరాంజనేయ స్వామి ఆలయ సమీపంలో బుధవారం ఘనంగా శివస్వాములు మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి గంగపూజ, మల్లికార్జున స్వామి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శివ స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఈ మహాపడి పూజ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల శివస్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండల కేంద్రంలో శివ స్వాముల పడిపూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన నాంగరి హన్మంతు ఇంట్లో నిర్వహించిన పూజలో శివనామస్మరణ మారుమోగింది. స్వామి వారికి పంచామృతాభిషేకం, బిల్వష్టం, శివాష్టకం వంటి పూజలు నిర్వహించారు. శివస్వాముల భజన పాటలతో గ్రామంలో శివనామ స్మరణ మారుమోగింది.

సెలవు దినంగా ప్రకటించాలి


తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీజీయూఎస్ సంఘం నాయకులు

కుల్కచర్ల: సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సేవాలాల్ జయంతి 15న సెలవు లేకపోవడం వల్ల గిరిజన ఉద్యోగులు, విద్యార్థులు ఆయన జయంతిలో పాల్గొనేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి కంల్యానాయక్, నాయకులు చందర్ నాయక్, రాము నాయక్, దామోదర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.